భూ సమస్యలు పరిష్కరించాలి

కులకచర్ల, జూలై 23: కులకచర్ల మండలంలోనిపీఓపీ లోఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని రైతులు అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను కోరారు. చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన అడిషనల్ కలెక్టర్‌ను వారు కలిశారు. మండలంలో ఉన్న ప్రోహిబిటేడ్ ఆఫ్ ప్రాపర్టీస్‌లో ఉన్న భూసమస్యలతో ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని కోరారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా జిల్లాలోని ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదని, కొత్త రైళ్లకు నిధులు కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులకు మాత్రం కొంత అనుకూలంగా కొంత వ్యతిరేకంగా ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎంతో కొంత ప్రాధాన్యత లభిస్తుందన్న ప్రజల ఆశలు ఈ బడ్జెట్‌తో అడియాశలే అయ్యాయి. మొత్తంగా కేంద్ర బడ్జెట్ కొందరికి ఖేదం.. కొందరికి మోదం అన్న తీరులో ఉందన్న చర్చ సాగుతోంది.

వేతన జీవులకు కొంత ఊరట

ఆదాయ పన్ను విషయానికి వస్తే ఈసారి కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్‌లో వేతన జీవులకు కొంత ఊరట కలిగించారు. ఉద్యోగ విరమణకు సమీపంలో ఉన్న ఉద్యోగులు ఏడాదికి రెండు నెలల వేతనం ఆదాయం పన్ను కింద ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తున్న విషయం తెలిసిందే. ఆదాయ పన్ను చెల్లింపుల్లో కొత్త విధానం అనుసరించే ఉద్యోగులకు



స్వల్ప ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకుంది. రూ. 3 లక్షల వరకు ఎలాంటి పన్నూ విధించలేదు. రూ.3 లక్షల నుంచి రూ.7లక్షల వరకు 5శాతం పన్ను విధించగా, రూ.7 లక్షల నుంచి రూ.10లక్షల లోపు 10శాతం, రూ.10లక్షల నుంచి రూ.12లక్షల వరకు 15 శాతం, రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు 20శాతం, రూ.15లక్షలకు పైబడిన ఆదాయానికి 30శాతం పన్ను విధించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కొత్త పన్ను విధానం వల్ల రూ.17,500 పన్ను ఆదా కానున్నట్లు తెలిపింది. కాగా, పాత పన్ను విధానంలో కొనసాగుతున్న ఉద్యోగుల పన్ను చెల్లింపుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. అయితే, పన్ను చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. ఆదాయ పన్ను చెల్లింపుల నుంచి తమకు ఊరట కలిగేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ఉంటుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది.

- వేతన జీవులకు అంతంతే!
- కృష్ణ రైల్వేలైన్ ఊసే లేదు
- పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తావనేదీ
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



విద్య, ఉపాధి, నైపుణ్య రంగాలకు ప్రాధాన్యం

కేంద్ర బడ్జెట్‌పై సాధారణ మధ్య తరగతి వర్గాలతో పాటు వేతనజీవులు, రైతులు, వ్యాపారులు, నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, వారి ఆశలకనుగుణంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించే ప్రధానమంత్రి అన్న యోజన పథకాన్ని మరో అయిదేళ్లు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు కొంత ఊరట కలగనుంది. అదేవిధంగా పప్పు ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తి పెంచడానికి వీలుగా చర్యలు తీసుకోనున్నట్లు కేంద్ర ప్రభుత్వం



ప్రకటించింది. యువత కోసం కేంద్రం అయిదు ప్రత్యేక పథకాలు ప్రకటించింది. విద్య, ఉపాధి, నైపుణ్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలియజేసింది. ప్రధానమంత్రి ప్యాకేజీలో భాగంగా మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాలను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. కొత్త ఉద్యోగాల కల్పనలో భాగంగా తొలి నెల వేతనం కేంద్ర ప్రభుత్వమే చెల్లించనున్నట్లు తెలిపింది. ఉపాధి కల్పన, నైపుణ్య శిక్షణ, ఎంఎస్ఎంఈపై దృష్టి సారించింది. ఉన్నత విద్య చదివే విద్యార్థులకు రూ. 10 లక్షల రుణం ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల విద్యార్థి వర్గాల నుంచి సానుకూల స్పందన లభించింది. బంగారం ధరలు తగ్గేలా, పేదల సొంతింటి కల సాకారం చేసే విధంగా తీసుకున్న నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ పథకాలు ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు కొంత తోడ్పాటునందించనున్నాయి.

ప్రాజెక్టులకు మొండిచేయి



పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో విజ్ఞప్తి చేసింది. లేదంటే ప్రత్యేక నిధులైన ఇవ్వాలని కోరింది. అయితే, ఈ కోరికను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లోనే పూర్తిగా నిధులు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మూసీ రివర్ ఫ్రంట్‌కు నిధులు ఇవ్వాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదు.

వికారాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ జిల్లా ప్రజలకు మళ్లీ నిరాశే మిగిల్చింది. రైతులకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు కొంత ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకోగా, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనా రంగాలకు పెద్దపీట వేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి ఏమాత్రం ప్రస్తావించకపోవడం జిల్లా ప్రజలను నిరాశ పరిచింది. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో గతంలో ఇచ్చిన హామీలపై ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

కూత పెట్టని రైళ్లు



దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టుల గురించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం. వికారాబాద్ - పరిగి - రాయచూర్ - కృష్ణ మార్గంలో కొత్తగా రైల్వేలైన్ కోసం సర్వే పనులు కొనసాగుతుండగా, నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగలేదు. లింగంపల్లి వరకు నడపిస్తున్న ఎంఎంటీఎస్ రైళ్లను వికారాబాద్ వరకు నడిపించాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ బడ్జెట్‌లోనైనా ఎంఎంటీఎస్ రైళ్లను వికారాబాద్ వరకు పొడిగించే ప్రస్తావన వస్తుందని ఆశించిన వికారాబాద్ జిల్లా కేంద్రం ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది.



తెలంగాణకు మొండి చేయి



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచెయ్యి చూపింది. ప్రధాని మోదీ తన కుర్చీని కాపాడుకునేందుకే ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టినట్లుంది. తెలంగాణ నుంచి ప్రజలు బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే రాష్ట్రానికి బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చింది. రాష్ట్రానికి నిధులు కేటాయించేలా రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలి.

- పి.రఘువీరారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ధారూరు

పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసేలా ఉంది



ఉపాధి, నైపుణ్య, శిక్షణ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, పేద, మధ్య తరగతి ప్రజలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. యువతకు ఉపాధి, నైపుణ్యం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వ్యవసాయంలో ఉత్పాదక, స్థితి స్థాపనకత, పట్టణాభివృద్ధి, తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించింది. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది.

- బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్‌లో వివక్ష చూపారు



కేంద్రం వెలువరించిన బడ్జెట్ ప్రజామోద్య యోగ్యంగా లేదు. బడ్జెట్ పట్ల వివక్ష చూపారు. తెలంగాణ అనే పదాన్ని కూడా ఉచ్చరించలేదు. తెలంగాణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి కోరినా బడ్జెట్‌లో కేటాయించలేదు. ఆర్ఆర్ఆర్‌తో పాటు ఏ రంగానికి కూడా నిధులు కేటాయింపు జరగలేదు. పాలమూరు ప్రాజెక్టు, మెట్రో విస్తరణకు నిధులు కేటాయించాలి. ఉద్యోగ కల్పన, నైపుణ్యత మధ్య తరగతి రంగాలకు ప్రాధాన్యత కల్పించలేదు.

- చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు

తెలంగాణకు తీవ్ర అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 సీట్లు ఇచ్చినా కనీసం ఎనిమిది రూపాయలు కూడ కేటాయించలేదు. కేంద్రం తెలంగాణను చిన్నచూపు చూసింది. కొత్త పన్నుల విధానంలో వారికి మాత్రమే రాయితీలు ప్రకటించడం ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర ఆగ్రహావేశాలకు గురి చేసే విధంగా ఉంది.

పాలమాకుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ



సీపీఎస్ విధానంలో మార్పు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తు మాట కూడా బడ్జెట్లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశ కలిగించింది. విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ప్రస్తుతం3.25 శాతం నిధులు మాత్రమే కేటాయించింది. వచ్చే ఐదేళ్లలో నాలుగు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా చెప్పింది. కానీ గడిచిన 10 ఏళ్లలో ఎన్ని కోట్ల ఉద్యోగాలు సృష్టించిందో కనీస ప్రస్తావన కూడా చేయలేకపోయింది. పాత పెన్షన్‌పై ఒక స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. పాత పనుల విధానంలో రూపాయలు ఏడు లక్షల వరకు ఎలాంటి పన్ను లేకుండా మినాయింపు ఇచ్చే విధంగా పన్నుల స్లాబ్ విధానాన్ని సవరించాలి.

- కె. గోపాల్‌నాయక్, టీఎస్ యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు



ఒక్క మొక్క పెంచితే ఒట్టు!

- తాండూరు మున్సిపాలిటీలో నర్సరీ లేవీ!
- వన మహోత్సవానికి ప్రణాళికేది
- సీడీఎంఏ, కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు
- లక్ష్యం మేర 60 వేల మొక్కలు నాటుతారా.. కాకి లెక్కలు చూపుతారా..



తాండూరు, జూలై 23: జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కల పెంపకం, నాటేందుకు గతం ప్రభుత్వం హరితహారంగా కొనసాగించిన పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవంగా మార్పు చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వం మొక్కలు నాటేందుకు ప్రతి మున్సిపాలిటీకి లక్ష్యాలను నిర్దేశించింది. జిల్లాలో ఉన్న ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే తాండూరు మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. మున్సిపల్ పరిధిలో మొక్కలు పెంచేందుకు ఒక్క నర్సరీ కూడా ఏర్పాటు చేయలేదంటే అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కడుతోంది. దేశంలోనే కాలుష్యంలో తాండూరు రెండో స్థానంలో ఉంది మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి కాలుష్యాన్ని నియంత్రించాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొట్టమొదటి సారిగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేయలేదు.

లక్ష్యం ఇలా..

తాండూరు మున్సిపాలిటీలో వనమహోత్సవంలో భాగంగా 60 వేల మొక్కలను నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ధేశించింది. జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ నిర్ధేశించిన లక్ష్యాల మేరకు మున్సిపల్ స్థాయిలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. 15 రోజులు గడిచినా ఇంత వరకు తాండూరు మున్సిపాలిటీలో వనమహోత్సవానికి సంబంధించి ప్రణాళికను తయారు చేయలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీ వద్ద ఒక్క మొక్క కూడా లేదు.

కొత్తగా నర్సరీలు ఏవి!

మొక్కల పెంపకానికి నర్సరీలను ఏర్పాటు చేయాలని పేర్కొంటూ ఫిబ్రవరి నెలలో సర్క్యులర్ జారీ చేశారు. 6నెలలు గడుస్తున్నా ఒక్క నర్సరీని ఏర్పాటు చేయలేదు. సీడీఎంఏ సూచనలను, కలెక్టర్ ఆదేశాలను సైతం తాండూరు మున్సిపాలిటీ అధికారులు పక్కన పెట్టారు. గతంలోనున్న రెండు నర్సరీల లెక్కలను ఉన్నతాధికారులకు చూపిస్తు కాలం గడుపుతున్నారు. సీడీఎంఏ అధికారులు నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచాలని, ఎన్ని నర్సరీలు ఏర్పాటు చేస్తారో, ఎన్ని మొక్కలు పెంచుతున్నారె వివరాలను కూడా అడిగారు. అయితే ఉన్నతాధికారులకు పంపుతున్న లెక్కలకు, ఇక్కడ ఉన్న వాస్తవంగా ఉన్న నర్సరీలకు పొంతన లేకుండా పోయింది. నర్సరీలను ఏర్పాటు చేసి అందులో సీతాఫలాల, మామిడి, రేగు, సపోట, యాపిల్, పూలు, పండ్ల మొక్కలను పెంచాలి. వర్షకాలంలో వాటిని సిద్ధం చేసి పంపిణీ చేయాలి. మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా, ఆరు నెలలు దాటింది. ఈ సీజన్‌లో మొక్కలు నాటాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు.

కోనుగోలు పేరిట నిధుల ఖర్చు

నర్సరీలను ఏర్పాటు చేయకుండా, ముందస్తు ప్రణాళిక లేకుండామొక్కలు నాటే సమయంలో తాండూరు మున్సిపాలిటీ అధికారులు చేతులెత్తేస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా తాండూరు మున్సిపల్ అధికారులు మొక్కలను కోనుగోలు చేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. కొన్ని మొక్కలు తెచ్చి వేలల్లో మొక్కలు కోనుగోలు చేసున్నామంటూ కాకి లెక్కలు చేపుతున్నారు.గ్రీన్ బడ్జెట్ నుంచి నిధులను డ్రా చేస్తున్నారు. ప్రతియేడాది కాంట్రాక్టర్ల పేరిటా బిల్లులు చేసి భారీగా నిధులను దారి మళ్లిస్తున్నారు. ఈ బిల్లులు కూడా కౌన్సిల్ దృష్టికి వెళ్లకుండా చెల్లింపులు జరుగుతున్నాయి.

104.530 కిలోల గంజాయి ధ్వంసం

వికారాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 104.530కిలోల గంజాయిని కాల్చివేశారు. జిల్లాలో 31సంఘటనల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని మంగళవారం సంగారెడ్డిజిల్లా,ఇస్నాపూర్‌లోని మెడికేర్ ఎన్విరాన్‌మెంటల్‌మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కాల్చివేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళితే జీవితం చిత్తవుతుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను తీసుకున్నా.. తీసుకునేలా ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



విద్యుత్ సదుపాయ కల్పనలో నిర్లక్ష్యం వహించొద్దు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్, జూలై 23: రైతులకు విద్యుత్ సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ రంగంలో విద్యుత్ సరఫరా పురోగతిపై విద్యుత్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు నిర్ణీత గడువులోపు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. రైతులు బోర్లు వేసుకున్నప్పటికీ సుదీర్ఘకాలంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ఆగస్టు 20లోపు పనులను పూర్తి చేయాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్నవిద్యుత్ కనెక్షన్లపై ఇంజనీర్‌లతో అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకం అర్హులందరికీ వర్తించేలా చొరవ చూపాలన్నారు. మున్సిపల్, మండలాల్లో నిర్వహించే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కడా కార్యాలయంలో నారాయాణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి కలెక్టర్ ప్రతీక్‌జైన్ కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ కింద చేపట్టే పనులను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి, డీఈ సంజీవి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పేదలకు ఉపయోగపడేలా పల్లె దవాఖానాలు

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్‌రూరల్, జూలై 23 : పల్లె దవాఖానాలు పేద ప్రజలకు ఉపయోగ పడేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఔట్ పేషంట్ల శాతాన్ని పెంచాలని కలెక్టర్ గౌతం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఘట్‌కేసర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలెక్టర్ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలోని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జనాభా ప్రాతిపదికన వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. ల్యాబ్‌లను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. డయాలసిస్ విభాగంలో ఎంతమంది పేషంట్లు వచ్చారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోచారం మున్సిపాలిటీలోని పల్లె దవఖానాను సందర్శించారు. వారంలో రెండు సార్లు బస్తీల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని కమిషనర్, ఎఎన్ఎంలను ఆదేశించారు. ప్రతాప్‌సింగారంలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు అయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి, మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, ముల్లి పావనిజంగయ్యయాదవ్, కమిషనర్లు వేమనారెడ్డి, సాబేర్ అలీ, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్



రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు ఫిర్యాదు చేయాలి

కులకచర్ల, జూలై 23: మొదటి విడతగా రూ.లక్ష రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈవోలకు, నేరుగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఏవో వీరస్వామి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకుల్లో ఇబ్బందులు కలగకుంగా గ్రామాల వారీగా బ్యాంకర్లతో చర్చించి త్వరలో తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. రుణమాఫీ కాలేదని రైతులు ఫిర్యాదు చేశారని, వారి వివరాలను పరిశీలిస్తున్నామని వివరించారు.













నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాలి

దోమ, జూలై 23: రైతుల దగ్గర సేకరించిన బియ్యాన్ని నూర్పిడి చేసి నాణ్యతతో ప్రభుత్వానికి అందించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర రైసుమిల్లు యజమానులకు సూచించారు. మండలంలోని మోత్కూర్ గ్రామంలోని మహాలక్ష్మీ రైసుమిల్లును మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైసుమిల్లు యజమాని శ్రీధర్ రెడ్డి ఉన్నారు.



మోత్కూర్ రైసుమిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీరాజ్ అధికారి జయసుధ


మీసేవా కేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు

మర్పల్లి, జూలై 23: మీ సేవాకేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేసినా, దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే లబ్ధిదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని జిల్లా పంచాయతీరాజ్ అధికారి జయసుధ అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాల్లో నిర్వాహకులు డబ్బులు అధికంగా వసూలు చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆమె నవాబుపేట ఎంపీడీవో అనురాధతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి మీ సేవ దగ్గర ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వస్తే నిర్వాహకులు ఎలా ప్రవర్తిస్తున్నారని, రశీదులో వచ్చే రుసుం కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ఏ మీసేవా కేంద్రంలోనైనా అధిక వసూలు చేస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మర్పల్లి ఎంపీడీవో రాజమల్లయ్య, ఆర్ఐ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఉన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వికారాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపట్టిన 765 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్లో ఉన్న విలువ ప్రకారం పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రాష్ట్రంలో 165కిలోమీటర్ల మేర నిర్మించనున్న పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్ కోసం రైతులు మూడు వేల ఎకరాల భూములను కోల్పోతున్నారని తెలిపారు.జిల్లాలో మర్పల్లి, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, వికారాబాద్, పూడూరు మండలాల మీదుగా కొనసాగనున్న పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్, టవర్ల నిర్మాణంలో రైతులు ఒక్కో టవర్‌కు 12 గుంటలు, ఎలక్ట్రిక్ లైన్‌కు 12 గుంటల మేర భూములు కోల్పోనున్నారని వివరించారు. రైతులు కోల్పోయే భూముల విలువ మార్కెట్ విలువ కోటి నుంచి మూడు కోట్ల వరకు ఉందని తెలిపారు. ఈ విలువ ప్రకారం సరైన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.





కొత్త పట్టాదారులకు రైతుబీమా

ఆగస్టు 5లోగా దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్, జూలై 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతుబీమా పథకం కొనసాగింపునకు కాంగ్రెస్ సర్కార్ సంసిద్ధమైంది. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు, గతంలో బీమా పథకంలో ఉండి నామినీ చనిపోయిన వారు, ఆధార్‌కార్డులో తప్పులున్న వారు సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. గ్రామాల వారీగా నిర్ధేశిత గడువులోగా కొత్త పట్టాలు పొందిన వారి జాబితాను ప్రకటించింది. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు పత్రాలను సంబంధిత వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులకు ఇచ్చారు. వారి సమక్షంలో రైతు దరఖాస్తుపై సంతకం చేయాలి.

జూన్ 28 లోపు పట్టాలుంటేనే

కొత్తగా పట్టాలు పొందిన వారు ఇదివరకు బీమా పథకంలో లేకుంటే ఆగస్టు 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. పట్టా జూన్ 28వ తేదీ లోగా పట్టా జూన్ 28వ తేదీలోగా రిజిస్టర్ అయి ఉండాలి. బీమా పరిధిలోకి రావాలంటే ఆగస్టు 14, 1965 నుంచి ఆగస్టు 14, 2006 మధ్య పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఎల్ఐసీ బీమా నిబంధనల ప్రకారం ఆధార్‌కార్డులో 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన రైతులు దీనిని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

రుణమాఫీని ఓర్వలేకనే చౌకబారు మాటలు



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, జూలై 23 : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న రైతుల రుణమాఫీని చూసి ఓర్వలేకనే శాసనసభలో బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండిపడ్డారు. మంగళవారం జరిగిన బడ్జెట్ సమావేశాల అనంతరం ఆయన మీడియా ఆవరణలో మాట్లాడుతూ.. శాసనసభలో బీజేపీ నేతలు చౌకబారు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దక్షిణ భారతదేశ అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించారో తెలపాలని డిమాండ్ చేశారు. రుణమాఫీలో నోడల్ ఏజెన్సీల తప్పిదాల వల్లే కొందరికి రుణమాఫీ డబ్బులు జమ కాలేదన్నారు. ప్రభుత్వం రూపొందించిన గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతీ రైతు ఖాతాలో డబ్బు జమ చేశామన్నారు. రుణమాఫీకి నిధుల కొరత లేదని, ఏదో ఒకటి మాట్లాడాన్న ఉద్దేశంతోనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయన్నారు. తమ నియోజకవర్గంలో ఒక్క బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు మాత్రమే రుణమాఫీ విషయంలో తప్పిదాలు చేశారని తెలిపారు. వరే చోట్ల మాఫీ సాఫీగా జరిగిందన్నారు.

పౌరాణికాలను ప్రోత్సహించాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న బండారి రమేష్

షాద్‌నగర్, జూలై 23: అంతరించిపోతున్న పౌరాణిక నాటకాలను ప్రోత్సహించాలని ప్రముఖ వ్యాపారవేత్త, విశ్వహిందూ పరిషత్ అగ్రనాయకులు, శ్రీవాణి సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బండారు రమేష్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సంస్థ నిర్వహించే నాటకాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సినిమాల రాకతో పౌరాణిక నాటకాలు ఆదరణ కోల్పోయాయన్నారు. ప్రజలకు గుణాత్మక సందేశాలిచ్చే పౌరాణిక నాటకాలు, కళాకారులను ఆదుకోవాలన్నారు.

వన మహోత్సవం లక్ష్యం పూర్తికి చొరవ తీసుకోవాలి



మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో శ్రీలత

తలకొండపల్లి, జూలై 23 : వన మహోత్సవం నిర్ణీత లక్ష్యం పూర్తి చేసేలా అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ తీసుకోవాలని డీఆర్డీవో శ్రీలత అన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో కనీసం 6వేల మొక్కలు నాటాలని సూచించారు. తలకొండపల్లి మండలంలో మంగళవారం ఆమెతో పాటు డీఆర్‌డీవో ఏపీడీ సుభాషిణి, అడిషినల్ పీడీ సక్రియతో కలిసి చుక్కాపూర్‌లో మొక్కలు నాటారు. గతంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం కేశంపేట, తలకొండపల్లి మండలాల అధికారులు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మండల పరిషత్‌లో వనమహోత్సవంపై సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో 50 ఎకరాల వరకు పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టేలా చూడాలన్నారు. ఎంపీడీవోలు శ్రీకాంత్, చంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రాయికుంట కట్ట మైసమ్మ బోనాలు

తాండూరు, జూలై 23: తాండూరు పట్టణం సాయిపూర్‌లోని రాయికుంట కట్ట మైసమ్మ దేవలయ పునర్నిర్మాణ పూజలతో పాటు ఆషాఢ మాస బోనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప నర్సింహులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బోనమెత్తిన చిన్నారి

తాండూరు ఆస్పత్రి తనిఖీ



తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కాయకల్ప బృందం

తాండూరు, జూలై 23: వైద్యవిధాన పరిషత్‌కు చెందిన కాయకల్ప బృందం డాక్టర్ దశరథ ఆధ్వర్యంలో మంగళవారం తాండూరు జిల్లా జనరల్ ఆస్పత్రిని, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కాయకల్ప కింద అవార్డు ఎంపికకు గానూ ఈ బృందం అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించింది. రోగులకు అందిస్తున్న సేవలు శానిటేషన్ వంటి అంశాలను పరిశీలించి వైద్యవిధాన పరిషత్‌కు నివేదిక అందజేయనుంది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి, వైద్యులు డాక్టర్ రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



కులకచర్ల: విఠలాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



షాబాద్: తిమ్మారెడ్డిగూడలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

కులకచర్ల, జూలై 23: రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. చౌడాపూర్ మండలంలోని విఠలాపూర్ గ్రామంలో మంగళవారం రైతులు సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను సర్వే నెంబరు ఆధారంగా పరిశీలించారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల దగ్గర పంటల వివరాలను నమోదు చేయించాలన్నారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి తగిన మోతాదులో ఎరువులను వాడాలని సూచించారు. అదేవిధంగా అర్హులైన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా పత్తిపంటలో చీడపీడల నివారణకు యాజమాన్యం పద్ధతులపై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ మాట్లాడుతూ.. రైతులకు రునహాఫీ, రైతు బీమా పథకాల గురించి వివరించారు. వర్షాకాలం సీజన్‌లో సాగు చేసే పంటల్లో తీసుకోవాల్సిన యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసి ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

మాఫీ పొందిన రైతులు కొత్త రుణాలు తీసుకోవాలి

షాబాద్, జూలై 23 : రుణమాఫీ పొందిన రైతులు కొత్త రుణాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మొదటి విడత రుణమాఫీ అయిన తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, ముద్దెంగూడ, వెంకమ్మగూడ గ్రామాల రైతులు ఎర్రోళ్ల అనిత, ప్రకాష్, కిష్టయ్య, గుత్తి గోపాల్, సిద్ధాపురం కమలమ్మ, రాజు, కూర పాండు, కూర సత్తయ్యలను వివరాలు అడిగారు. డీఏవో మాట్లాడుతూ.. రుణమాఫీతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. రుణమాఫీ చేయడంతో లోన్ బ్యాలెన్స్ జీరో అయ్యిందని, ఇప్పుడు కొత్తగా రుణం తీసుకొని సాగు పనులకు వాడుకుంటామని రైతులు చెప్పారన్నారు. నాగర్‌గూడ ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడి రుణమాఫీ అయిన రైతులకు లోన్ రెన్యూవల్ చేయాలని సూచించారు. డీఏవో వెంట ఏవో వెంకటేశం, ఏఈవోలు గీత, రాజేశ్వరి, రైతులు ఉన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

కూరగాయలు, పట్టుపురుగుల పెంపకంతో ఆర్థిక ఇబ్బందులు తీరుతాయి



చౌదర్‌పల్లిలో ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న నీరజాగాంధీ

యాచారం, జూలై 23: తక్కువ పొలంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడంపై రైతులు ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నీరజాగాంధీ రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువులతో పంటల సాగు చేయడంపై రైతులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం యాచారం మండలం చౌదర్‌పల్లిలో కూరగాయల సాగు, పట్టు పురుగుల పెంపకం. ఆయిల్‌పాం తదితర పంటల సాగుపై వారు రైతులకు అవగాహన కల్పించారు. ప్రతీ రైతు రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు వాడి పంటల ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వాడితే పంట ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో పాటు పోషక పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. కాయ కాండం తొలిచే పురుగుల నివారణకు వేపనూనె లీటర్ నీటిలో రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పట్టు పురుగుల పెంపకంపై రైతలు అవగాహన పెంచుకోవాలన్నారు. పట్టుపురుగుల పెంపకంతో లాభాలు గడించడం చాలా సులువన్నారు. నేడు మార్కెట్లో పట్టు వస్త్రాలపై జనం ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని, దాంతో పట్టుకు మంచి డిమాండ్ ఉందన్నారు. మల్బరీ తోటల పెంపకం ఈ ప్రాంతంలో లేకపోవడం బాధాకరమన్నారు. నేడు మార్కెట్లో టమాట, వంకాయ చిక్కుడు, గోరుచిక్కుడు, బీట్‌రూట్, క్యాబేజీ తదితర కూరగాయల సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు డాక్టర్ వినోద్‌కుమార్, రాఘవేందర్. ఉద్యానవన శాఖ డివిజనల్ అధికారి కనకలక్ష్మి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆమనగల్లు, జూలై 23: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ఆమనగల్లు జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఆమనగల్లులో నిరసన చేపట్టారు. విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్, విద్యార్థులు తహసీల్దార్ లలితకు అందజేశారు. సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, అర్జున్, నితిన్, పవన్, రామ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైవే జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లకు ఎన్‌హెచ్ఏఐ సుముఖత

కొత్తూర్, జూలై 23: ప్రమాదాల నివారణకు 44వ నంబర్ జాతీయ రహదారిపై జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్ల ఏర్పాటుకు ఎన్‌హెచ్ఏఐ సుముఖత వ్యక్తం చేసింది. మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఉన్న వైం జక్షన్, పెంజర్ల జంక్షన్, జేపీ దర్గా జంక్షన్, నందిగామ జంక్షన్ల వద్ద తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత నెల 24న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఏఐ కార్యాలయంలో అధికారులకు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు స్పందిస్తూ ఎమ్మెల్యేకు మంగళవారం లేఖ పంపారు. హైదరాబాద్-కర్నూల్ 44వ జాతీయ రహదారి 6లేన్ల విస్తరణ ఫేస్-1, ఫేస్-2లో భాగంగా కొత్తూర్ వై జంక్షన్, పెంజర్ల జంక్షన్, జేపీ దర్గా జంక్షన్, నందిగామ జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణానికి కృషిచేసిన ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు.

స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి

రాచకొండ పోలీసుల వినూత్న ప్రయోగం.. టెక్నాలజీకి పెద్దపీట



స్కాన్ చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 23: ప్రజా రక్షణ.. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా.. పోలీస్ అధికారులు ప్రజలకు చేరువై.. మరిన్ని సేవలందించేందుకు కృషిచేయాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ట్రెండ్ నడుస్తుండటంతో.. ప్రజలతో మమేకమై పాలనలో భాగస్వాములను చేయాలని సీపీ సంకల్పించారు. ఐటీ సెల్ ఆధ్వర్యంలో అందుబాటులోకి తెచ్చిన ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను నగరంలోని నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో మంగళవారం సీపీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాచకొండ పోలీస్ సోషల్ మీడియా ఖాతాలైన ఫేస్‌బుక్, ఎక్స్(ట్విటర్), ఇన్‌స్టాలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టేషన్ల రిసెప్షన్లలో ఏర్పాటు చేసిన ఈ క్యూఆర్ కోడ్ పోస్టర్‌లను స్కాన్ చేసి పోలీసుల సోషల్‌మీడియాను ఫాలో అవ్వడం, యూ ట్యూబ్ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, ఇతర సమాచారానికి రాచకొండ పోలీస్ వాట్సాప్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712662111కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజేష్ చంద్ర, ప్రవీణ్‌కుమార్, సునీతారెడ్డి, ఉషావిశ్వనాథ్, అరవింద్‌బాబు, కరుణాకర్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

తెలుగులో హెల్త్‌కేర్ అప్లికేషన్లు

డీప్ లెర్నింగ్‌తో అనువాదం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వింగ్ కమాండర్ శ్రీనివాస్

మేడ్చల్ టౌన్, జూలై 23: హెల్త్‌కేర్ అప్లికేషన్లు ఇకపై డీప్ లెర్నింగ్ టెక్నాలజీని ద్వారా తెలుగు భాషలో అనువదించవచ్చు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏఐసీటీఈ వాణి వారు నిర్వహిస్తున్న మూడు రోజుల సదస్సును డైరెక్టర్ మిల్‌స్టార్ ఆర్ఎఫ్. అండ్ మైక్రోవేవ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, వింగ్ కమాండర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల భాషలోని ఆరోగ్య సంబంధిత అప్లికేషన్లను మాతృ భాష అయిన తెలుగులో ప్రతీ అక్కరు సులభంగా అర్థం చేసుకునే విధానాన్ని కనుగొనటం ఒక గొప్ప ఆవిష్కరణతో సమానమన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా వుండటానికి అనేక అప్లికేషన్లు వాడుతున్నారన్నారు. కాగా అప్లికేషన్లు ఆంగ్ల భాషలో ఉండటంతో వాటిని వినియోగించుకోవటం అందరికీ సాధ్యపడటం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్య పరమైన విషయాలు తెలుగులో ప్రతీ సామాన్యుడు అర్థం చేసుకునే విధాన ఆవిష్కరణకు లర్నింగ్ టెక్నాలజీ ఎంతగానో దోహద పడుతుందన్నారు. డీప్ లెర్నింగ్ టెక్నాలజీని మరింత అభివృద్ధి పరచడానికి నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేయడం కళాశాల నైపుణ్యానికి నిదర్శనమన్నారు. సీఎస్ఐ సభ్యురాలు రమ ఎస్.పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆధునిక యుగంలో అన్నిరకాల సమస్యలు టెక్నాలజీ ద్వారా పరిష్కారించబడుతున్నాయన్నారు. ప్రతీరంగంలో కొత్త టెక్నాలజీల ఆవిష్కరణలు సమాజాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్తున్నాయన్నారు. హెల్త్ అప్లికేషన్ల ద్వారా ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని రోగాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. హెల్త్ అప్లికేషన్‌లో స్కిల్స్‌ను నర్సింహారెడ్డి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మరింత అభివృద్ధి చేసి ప్రతి సామాన్యుడికి అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. ఏఐసీటీఈ విణి ప్రయోజిత సదస్సు కోసం సుమారు 100కళాశాలలు పోటీ పడగా ఆ అవకాశం మాత్రం తమ కళాశాలకు లభించిందని కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి అన్నారు. డీప్ లెర్నిగ్ టెక్నాలజీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఏ.మోహన్, కోఆర్డినేటర్ డీన్ డాక్టర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, హెచ్‌వోడీ డాక్టర్ రాము, డాక్టర్ రామసుబ్బారెడ్డి, లక్ష్మి, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

భారీగా నల్లబెల్లం పట్టివేత



నల్లబెల్లం తరలిస్తూ పట్టుబడ్డ ముద్దాయిలతో ఎక్సైజ్ పోలీసులు

పెద్దేముల్, జూలై 23: మండలంలోని ఓంప్లానాయక్‌తండా శివారులో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ గౌడ్, టీడీఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమర్‌లు మంగళవారం పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసు సిబ్బందితో మాటు వేసి ఒంప్లానాయక్‌తండా వద్ద నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వ్యాన్‌లో పరిశీలించగా 5180కిలోల నల్లబెల్లం ఉంది. ఈబెల్లం కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. నల్లబెల్లం తరలిస్తున్న రాథోడ్ పాండునాయక్, రాథోడ్ ఓంసింగ్, రాథోడ్ సచిన్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా సారా తయారు చేసే వారికి కిలో రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. పట్టుబడిన నల్లబెల్లం సుమారు రూ.4లక్షల మేర ఉంటుందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పాండుపై ఇలాంటి పలు కేసులు గతంలో కూడా నమోదై ఉన్నాయని చెప్పారు. బెల్లంతో పాటు బెల్లం రవాణాకు వాడిన వాహనాన్ని అదుపులోకి తీసుకుని ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ శ్రీనివాస్ రెడ్డి, తాండూరు సీఐ గంగాధర్, సిబ్బంది విష్ణు, హన్మంతు, శివ, రవికుమార్ పాల్గొన్నారని తెలిపారు. టీడీఎఫ్ బృందాన్ని ఎక్సైజ్ కమిషన్ ఇ.శ్రీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ దశరథ్ వారిని అభినందించారు.

లంచం కేసులో మరొకరి అరెస్టు

కీసర రూరల్, జూలై 23: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఏసీబీకి పట్టుబడిన కేసులో మంగళవారం మరో అధికారిని ఆ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. స్టే వేకేట్ చేసే అంశంలో డబ్బులు డిమాండ్ చేస్తూ కమిషనర్ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో పాత్రధారి దమ్మాయిగూడ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డినీ ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పార్ట్‌నర్‌తో తలెత్తిన గోడ వివాదాన్ని పరిష్కరించేందుకు సుదర్శన్ ముందుగా మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను సంప్రదించారు. అతడి సమస్య పరిష్కారంలో భాగంగా స్టే వేకేట్ చేసేందుకు కేసు ఫైల్ చేసే విషయంలో సుదర్శన్‌తో రాజమల్లయ్య రూ.50వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య సూచన మేరకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డిని కలిశారు. కేసు ఫైల్ చేసేందుకు అతనూ డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన వాదించాల్సిన బాధ్యత ఉన్న మీరు డబ్బులు డిమాండ్ చేయడమేంటని సుదర్శన్ రామిరెడ్డిని ప్రశ్నించారు. అయినప్పటికీ రామిరెడ్డి మొండికేయటంతో అతడితో రూ.40వేలకు ఒప్పదం కుదుర్చుకున్నాడు. అందులో భాగంగా రెండు దఫాలుగా అతడికి కొంత నగదు అప్పగించాడు. ఆ సమయంలో వీడియో రికార్డింగ్ చేసి పెట్టుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను సంప్రదించారు. అందులో భాగంగానే ఏసీబీ అధికారులు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. అదేవిధంగా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరిస్తున్న రామిరెడ్డిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేశారు. రామిరెడ్డిపై కేసు నమోదు చేయటం పట్ల అతడి తరపున పలువురు న్యాయవాదులు ఏసీబీ అధికారులతో వాగ్వాదం పెట్టుకున్నట్లు సమాచారం. అతడి సంబంధం లేకుండా కేసు ఎలా నమోదు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. డబ్బులు తీసుకుంటున్నట్లు ఉన్న ఆధారాలను చూపడంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది. కాగా మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ కమిషనర్ నివాసంలోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా టీపీవో శ్రీధర్‌ను విచారించారు.

మోడల్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

భూసార పరీక్షల అంశంలో ప్రథమ బహుమతి



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

చేవెళ్ల, జూలై 23: భూసార పరీక్షల ఐడియా విన్నర్‌గా రాష్ట్రస్థాయిలో చేవెళ్ల మోడల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం సికింద్రాబాద్‌లో తెలంగాణ రాష్ట్రస్థాయి అంకురం బిజినెస్ ఇన్నోవేటర్ ప్రోగ్రాం ప్రాజెక్టు ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 జూనియర్ కాలేజీల విద్యార్థులకు మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మొదటి విభాగంలో రాష్ట్రస్థాయిలో చేవెళ్ల మోడల్ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. భూసార సాగు పరీక్షలతో రైతులకు కలిగే లాభాలపై విద్యార్థులు వివరించి భూసార పరీక్షలు చేసి చూపారు. నిర్వాహకుల విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ టేనావతి అభినందించారు.

జేపీ దర్గా వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు



ప్రారంభమైన డ్రైనేజీ పనులు

కొత్తూర్, జూలై 23: జేపీ దర్గా పరిసరాల్లో భూగర్భ మురుగునీటి కాలువలే లేక వర్షాకాలంలో దర్గా లోపలి వరకు వర్షపు నీరు వస్తోంది. భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను రాష్ట్ర వక్ఫ్ బోర్డు పట్టించుకోవడం లేదని ఆరోపణలొచ్చాయి. ఇటీవల దర్గాకు వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడారు. దీంతో అధికారులు స్పందించి మంగళవారం డ్రైనెజీ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా దర్గా వాసులు ఎమ్మెల్యేకు శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం ప్రియులకు అడ్డాగా జీపీ ఆఫీసు

చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు



పంచాయతీ ఆవరణలో మద్యం బాటిళ్లు

చౌదరిగూడ, జూలై 23: పంచాయతీ కార్యాలయాలను మద్యం ప్రియులు అడ్డాగా చేసుకుంటున్నారు. బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతుండడంతో కొందరు ఆఫీసులోనే మద్యం తాగుతూ అసాంఘిక చర్యలకు దిగుతున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం మద్యం సీసాలు కన్పించాయి. పంచాయతీ భవనాన్ని మందు బాబులు పర్మిట్ రూమ్‌గా మార్చారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎంపీవో విజయ్‌కుమార్ పాల్ స్పందిస్తూ పంచాయతీ భవనానికి తాళం వేసి వెళ్లిన తర్వాత ఎవరో వచ్చి మద్యం తాగారన్నారు. పంచాయతీ భవవం వద్ద అసాంఘిక కార్యకలాపాల నివారణకు కార్యదర్శి ధీరజ్‌తో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు.

సంజయ్‌గౌడ్‌కు ఇన్‌చార్జి పదవి



బషీరాబాద్, జూలై 23: తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా బషీరాబాద్ మండలం రెడ్డిఘణాపూర్ యువకుడు సంజయ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపకులు డాక్టర్. పిడమర్తి రవి మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ గౌడ్ మట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం సాధనకు ఏర్పడిన ఉద్యమకారులకు ఇవ్వాలనే ఆశయంతో సంఘం ఆధ్వర్యంలో ముందుకెళ్తామన్నారు.

ఏఐసీసీ చీఫ్ ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే


ఢిల్లీలో ఖర్గేతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూలై 23: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను మంగళవారం ఢిల్లీలో పరిగి ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రామ్మోహన్‌రెడ్డితోపాటు మహరాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానపటోలా ఉన్నారు. రామ్మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఖర్గేతోపాటు, కాంగ్రెస్ ముఖ్య నేతలను కలిసినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, జూలై 23: తాండూరులోని సాయిపూర్‌కు చెందిన నమ్రతకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు ఆర్థిక సాయంగా అందజేశారు.

గోవుకు అంత్యక్రియలు


గోమాత అంత్యక్రియల్లో గ్రామస్థులు

మోమిన్‌పేట్, జూలై 23: వికారాబాద్ జిల్లా, మోమిన్‌పేట్ మండల పరిధి మొరంగపల్లిలో గ్రామస్తులు గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోమాత మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గ్రామస్థులు భజనల మధ్య ఊరేగింపుగా ట్రాక్టర్‌లో మృతి చెందిన గోమాతను తరలించి గ్రామ శివాలయం ఆవరణలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మాజీ సర్పంచ్ పి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మనెయ్యయాదవ్, యువజన సంఘాల నాయకులు. గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

తాండూరు రూరల్, జూలై 23 : చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. అంతారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రజలతో సమావేశం నిర్వహించారు. అంతారం గ్రామానికి చెందిన ఇరువర్గాల మధ్య కొంత కాలంగా భూమి విషయమై గొడవలు జరుగుతున్నాయని తహసీల్దార్, కలెక్టర్, హైకోర్టుతోపాటు సీఐ, డీఎస్పీ, ఎస్పీ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు మంగళవారం పట్టణ సీఐ సంతోష్‌కుమార్ భూ విషయమై అంతారం గ్రామపంచాయతీలో ఇరువర్గాల సభ్యులతోపాటు ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇరువర్గాల వాదనతోపాటు ప్రజల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. భూతగాదాలతో గొడవలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు.

రోడ్లన్నీ బురదమయం


బురదమయంగా నవాబుపేట బస్టాండ్, ఎక్‌మామిడి రోడ్డు

నవాబుపేట, జూలై 23: మండలంలోని ఎక్‌మామిడి, శంకర్‌పల్లి రోడ్డు, అక్నాపూర్, సిద్దలూరు, పూలపల్లికి వెళ్లే రోడ్లు చినుకుపడితే చిత్తడిగామారి వాహనదారులకు నరకయాతన కలిగిస్తున్నాయి. వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరారు.

కంకల్ మండల ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

పూడూరు, జూలై 23: మండలంలోని కంకల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అసెంబ్లీ సమావేశంలో ప్రశ్నను లేవనెత్తాలని మండల సాధన సమితి ప్రతినిధులు కోరారు. గ్రామంలో సోమవారం సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంకల్ నూతన మండలంగా ఏర్పాటు కోసం భవిష్యత్తు కార్యరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రవీందర్ కంకల్, మల్లేష్, నర్సింహులు, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల స్పెషలాఫీసర్ సైదులు

శామీర్‌పేట, జూలై 23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతతో, సరిగ్గా వండి భోజనాన్ని అందించాలని మండల స్పెషలాఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సైదులు సూచించారు. మండలంలోని బొమ్మరాశిపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజనం సమయంలో స్పెషలాఫీసర్ తనిఖీ చేయగా విద్యార్థులకు పెట్టిన కూర నాణ్యతగా లేదని, విద్యార్థులు తినడం లేదని స్పష్టంగా, స్వయంగా స్పెషలాఫీసర్ తనిఖీలో తేలింది. విద్యార్థులు కూడా కూర సరిగ్గా చేసి పెట్టడం లేదని విద్యార్థులు స్వయంగా స్పెషలాఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషలాఫీసర్ ఆ పాఠశాల ఉపాధ్యాయులపై, వంట మనిషిపై తీవ్ర ఆగ్రహించారు. విద్యార్థులకు బాగా వండి నాణ్యతతో కూడిన భోజనాలు పెట్టాలని, మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతే కఠిన చర్యలు తీసుకుంటానని పాఠశాల ఉపాధ్యాయులను, వంట మనుషులను స్పెషలాఫీసర్ హెచ్చరించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని స్పెషలాఫీసర్ ఉపాధ్యాయులను హెచ్చరించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల్లో కూడా స్పెషలాఫీసర్ విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆ గ్రామ పరిధిలో నాటిన ప్లాంటేషన్‌ను, నర్సరీని సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆ గ్రామంలోని పలు వీధులను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ తనిఖీలో స్పెషలాఫీసర్ వెంట ఎంపీడీవో మమతా బాయి, ఎంపీవో సునీత, సిబ్బంది ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు


ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోచారం ఐటీసీ సీఐ రాజువర్మ

ఘట్‌కేసర్ రూరల్, జూలై 23: ప్రమాదాల నివారణకు తగినచర్యలు చేపట్టాలని పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ సీఐ రాజువర్మ తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడ ఎన్‌పీపీసీ చౌరస్తా, జోడిమెట్ల చౌరస్తాలను మంగళవారం అధికారులతో కలిసి సందర్శించారు. పంచాయతీకి వెళ్లే రోడ్డులో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారిపై ఉన్న చౌరస్తాల వద్ద వేగాన్ని నియంత్రించేందుకు సూచిక బోర్డులు, బ్లింకర్లను ఏర్పాటు చేయాలన్నారు. మక్తావద్ద అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు. పాదచారులు జీబ్రా క్రాసింగ్‌లైన్ వద్దనే రోడ్డుదాటాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ ట్రాఫిక్ సీఐ రవికుమార్, ఆర్ అండ్ బీ ఏఈఈ రంజీత్, చౌదరిగూడ కార్యదర్శి శశికుమార్, ఎస్‌ఐలు బద్దం నాగార్జున్‌రెడ్డి, కృష్ణయ్య, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

దౌల్తాబాద్: సమాజంలో అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని దౌల్తాబాద్ ఎస్‌ఐ రవి గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రౌడీ షీటర్లుగా పేర్లు మోపబడిన పలువురికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లుగా పేరుమోపబడిన వారు సమాజంలో అందరితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.


రౌడీషీటర్లుగా పేరుమోపబడిన వ్యక్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవిగౌడ్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

పరిగి, జూలై 23: కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపించారని సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి ఫీర్‌మహ్మద్, మండల కార్యదర్శి వెంకటేశ్‌లు ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతోపాటు, తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బలహీన ప్రధాని ఏపీ, బీహార్ సీఎంలకు భయపడి అధిక నిధులు కేటాయించారని తెలిపారు. విభజన హామీలను విస్మరించారని, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, నిధులు రాబట్టడంలో మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లు విఫమలయ్యారని విమర్శించారు. తెలంగాణపై కేంద్రం పూర్తిగా వివక్ష చూపిందన్నారు.

రాష్ట్రానికి నిరాశే మిగిల్చింది

వికారాబాద్: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నిరాశే మిగిల్చిందని, తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు మంచన్‌పల్లి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈప్రాంతం నుంచి ఎనిమిది మందిని కేంద్ర ప్రభుత్వంపై నమ్మకంతో పార్లమెంట్‌కు పంపితే పక్క రాష్ట్రంపై చూపించిన ప్రేమ ఈ ప్రాంతంపైన లేక పోవడం బాధాకరమైన విషయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచి ఈ ప్రాంతంపై సవితి తల్లి ప్రేమ చూపించిందని ఇప్పటికైనా ఈ ప్రాంత ఎంపీలు కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి అత్యధిక నిధులు తీసుకురావాలన్నారు.

కదిరి కృష్ణపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జూలై 23: సోషల్ మీడియాలో వేంకటేశ్వర స్వామి , సుభ్రపాతం గురించి కించపర్చే మాటలు మాట్లాడిన కదిరి కృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి డిమాండ్ చేశారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్‌ఐకి వినతి పత్రం అందజేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతిసే విధంగా మాట్లాడుతే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, పోకల సతీష్, బొత్సశ్రీకాంత్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నుంచి కంది పంటను కాపాడుకోవాలి


హస్నాబాద్‌లో కంది పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కొడంగల్ రూరల్, జూలై 23: కంది పంటను తెగుళ్ల నుంచి కాపాడుకోవాలని కంది పంట ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధాకర్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్, యమున రెడ్డిల బృందం అన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో మంగళవారం కంది పంట పొలాలను పరిశీలించారు. కంది పంటలో వచ్చే గొడ్డు తెగులును గుర్తించారు. ఈ తెగులు చాలా ఉధృతంగా వ్యాప్తి చెందుతుందని, తెగులు కారణంగా తగ్గుతుందని రైతులకు అవగాహన కల్పించారు. తెగులు సోకిన కంది మొక్కలను సమూలంగా తొలగించాలని, ఆరోగ్యకరమైన మొక్కలను రక్షించేందుకు డైకోఫోల్ 3 నుంచి 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఈవో పావని, రైతులు ఎంట్ల మల్లయ్య, బొంగు బుగ్గప్ప, నర్సింహులు, బొంగు చిన్న, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.17కోట్ల ప్రతిపాదన

మర్పల్లి, జూలై 23: మర్పల్లి వంద మీటర్ల రోడ్డుకు రూ.17 కోట్ల ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మర్పల్లి న్యూ బస్టాండ్ ఆవరణలో ఆర్అండ్‌బీ రోడ్డును మర్పల్లి నుంచి కొంశెట్టిపల్లి చౌరస్తా వరకు మంగళవారం పరిశీలించారు. రోడ్డు అధ్వానంగా మారిందని, వెంటనే తాత్కాలిక మరమ్మతుల కోసం నిధులు కేటాయిస్తామని తెలిపారు. మర్పల్లి బస్టాండ్ రోడ్డుకు డివైడర్‌తో పాటు వంద ఫీట్ల మేర రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలో పేర్కొన్నామన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములుయాదవ్, మండల అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

● మునిసిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి రమేష్


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల

వికారాబాద్, జూలై 23: అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. ఆషాడ మాసం బోనాల సందర్భంగా మంగళవారం వెంకటపూర్ తండాలో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ స్వాతి రాజ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్‌నాయకులు రత్నారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, పరుశురాం నాయక్, మాలే లక్ష్మణ్, మోముల రాజ్‌కుమార్ ,మల్లికార్జున్ గౌడ్, రవి నాయక్, మాలే లక్ష్మణ్, మోముల రాజ్ కుమార్, మల్లికార్జున్ గౌడ్, రవి నాయక్, సందీప్, రమేష్ నాయక్, బాబ్యా నాయక్, నరేందర్ నాయక్, స్థానిక నాయకులు ప్రజలు భక్తులు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి యువకుడు మృతి


మురళీ గౌడ్ (ఫైల్)

మేడ్చల్ టౌన్, జూలై 23: చెరువులో చేపలు పట్టడానికి ఏర్పాటు చేసిన వలలో చిక్కుకుని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి పూడూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం పెద్దచెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన మత్స్యకారులకు చేపల వలలో గ్రామానికి చెందిన మురళీ గౌడ్(28) మృతదేహం లభించటంతో వారు మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి మృతుడి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టగా మృతుడి కాళ్లు, చేతులకు వల తీగలు చుట్టుకుని ఉన్నాయి. దీంతో మృతుడు చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో ఏర్పాటు చేసిన చేపల వలలో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమికంగా ధ్రువీకరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కుంటుబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

పిడుగుపాటుకు ఎద్దు మృత్యువాత


మృత్యువాతపడిన ఎద్దు వద్ద బాధిత రైతు

ధారూరు, జూలై 23: మండలంలోని ఎబ్బనూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షంతో పిడుగుపడి ఓ ఎద్దు మృత్యువాతపడింది. మరో ఎద్దు త్రుటిలో ప్రాణపాయం నుంచి తప్పించుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎబ్బనూర్ గ్రామానికి చెందిన రైతు బేగరి రాజయ్య తన రెండు ఎడ్లను అయ్యారోల్ల పొలం దగ్గర మేత మేపుతున్నాడు. సాయంత్రం పూట రాజయ్య ఎడ్లను కొట్టుకుని ఇంటికి వెళ్దామని అనుకుంటున్న సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులతో పెద్ద శబ్దంతో ఎడ్ల సమీపంలో పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు అక్కడికక్కడే మృత్యువాతపడింది. దూరంలో ఉన్న మరో ఎద్దుకు త్రుటిలో ప్రాణపాయంతప్పింది. కాగా మృత్యువాతపడిన ఎద్దు విలువ రూ.75వేలు ఉంటుందని మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. పేద కుటుంబానికి చెందిన రైతు రాజయ్యకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు.

బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా

● ఇద్దరికి గాయాలు ● డ్రైవర్ నిద్రమత్తే కారణం


ఓఆర్ఆర్‌పై బోల్తా పడిన బియ్యం లారీ

ఘట్‌కేసర్ రూరల్, జూలై 23: బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ నుంచి రాయ్‌చూర్‌కు బియ్యంలోడ్‌తో వెళుతున్న లారీ(టీఎస్ 02-టీ- 0788) ఘట్‌కేసర్ సమీపంలోని అవుటర్ రింగ్‌రింగ్ రోడ్డు వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో లారీ ఓఆర్ఆర్ పైనుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో హర్యానా, మేవత్ జిల్లా, ఖునానా గ్రామానికి చెందిన వహీద్(30)తో పాటు క్లీనర్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయాలపాలైన డ్రైవర్, క్లీనర్‌ను ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 23: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన ఓమహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస కాలనీ, ఉప్పల్‌కు చెందిన మచ్చ మురళీధర్ తన భార్య మచ్చ మేఘన(40) ఈనెల 20వ తేదీన కీసర మండలం రాంపల్లిలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తున్నారు. అన్నోజిగూడలోని భారత్ పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే అదే రోడ్డులో వస్తున్న ట్యాంకర్ (టీఎస్-33- టీ- 4149) బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు కిందపడ్డారు. స్థానికులు గమనించి 108వాహనంలో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మచ్చ మేఘనా మంగళవారం మృతిచెందింది. పెట్రోల్ ట్యాంకర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


హనుమాన్ ఆలయం దగ్గర వంగి ఉన్న విద్యుత్ స్తంభం

కులకచర్ల, జూలై 23: మండల కేంద్రంలోని మైలమ్మ చెరువు ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభం ఓ పక్కకు వంగి ప్రమాదకరంగా ఉంది. ప్రతీ మంగళ, శనివారాల్లో, ప్రతీ రోజు తెల్లవారుజామున భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో వెళ్తుంటారు. వర్షాకాలంలో వీటి గాలులకు విద్యుత్ స్తంభం కింద పడే ప్రమాదం ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి


దరఖాస్తులు పరిశీలిస్తున్న లింగ్యానాయక్

కులకచర్ల, జూలై 23: పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. మండల పరిధిలో 111 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా అక్కడే 36 దరఖాస్తులను పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న దరఖా స్తులను పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఏ స్థాయిలో ఉన్న చర్యలు తీసుకొని పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ప్రభు, ఆర్ఐ వెంకటగిరి పాల్గొన్నారు.

మల్కన్‌గిరిని పంచాయతీగా ఏర్పాటు చేయాలి

● యువకుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో మాల్కన్‌గిరి యువకులు

బషీరాబాద్, జూలై 23: మండలంలోని మాల్కన్‌గిరి గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాని గ్రామస్తులు రిలే నిరాహార దీక్షకు దిగారు. ప్రస్తుత గ్రామ పంచాయతీ కాశీంపూర్ ప్రధాన చౌరస్తాలో మంగళవారం రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక యువకుడు బాలకృష్ణా మట్లాడుతూ గత సంవత్సరం నూతన పంచాయతీ కోసం దీక్ష చేపట్టగా అప్పట్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని గెజిట్ విడుదల చేస్తూ పేపర్ ప్రకటన చేసి మరిచిపోయిందన్నారు. అనుబంధ గ్రామంగా ఉన్న మాల్కన్‌గిరిలో 10 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.రేషన్, ఇతరేత్ర ఏ పనికైనా కాంశీంపూర్‌కు వెళాల్సివస్తుందన్నారు.మా గ్రామంలో 600 పైచిలుకు జనాభా ఉండగా, 400 మంది వరకు ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవీందర్, శ్రీనివాస్, ఎల్లేషం, సైదప్ప, రాములు, శ్రీశైలం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **శామీర్‌పేట:** మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం ఆధ్వర్యంలో, దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు. ఈ అన్నదానంలో ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, రాజీవ్‌రహదారిపై వెళ్లే భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

● **తాండూరు:** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవిలతో తాండూరు కాంగ్రెస్ నాయకులు, ఆర్బీఎల్ సిఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో శ్రీనివాస్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం తాండూరు నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయాలపై చర్చించారు.

● **కీసర రూరల్:** నాగారంను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి ఐదోవార్డు తిరుమల రాఘవేంద్రనగర్ కాలనీలో మంగళవారం రూ.11.50లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు అన్నంరాజ్ శ్రీనివాస్, మారుతి గార్డెన్ యజమాని చిన్న, కాలనీ వాసులు రమేష్, రవి, రంగనాయకమ్మ పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** బేవరేజ్ కార్పొరేషన్ ద్వారా మద్యం ధరల ఖారారు కోసం ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులుగా నియమితులైన నవీన్‌రెడ్డిని మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వంగా కలిసి సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్‌కు చెందిన ప్రాక్టీష్నర్ చార్టెడ్ అకౌంటెంట్ నవీన్‌రెడ్డిని త్రిసభ్యకమిటీలో స్థానం కల్పించడం అభినందనీయమని బాల్‌రెడ్డి అన్నారు.

ధారూరు: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయల బదిలీలు, పదోన్నతుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించడంతో ఉపాధ్యాయులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌లు తెలిపారు. పీఆర్టీయూ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కుక్కింద, గడ్డమీది గంగారం మున్నూర్ సోమారం, అవుసుపల్లి, రుద్రారం, నాగసమందర్, ధర్మపూర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు మాణిక్యం, రవీందర్‌రెడ్డి, శేఖర్, సుదర్శన్, సుధాకర్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: వైద్యశాఖ ఆధ్వర్యంలో బొంరాస్‌పేట్ రైతువేదికలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే వైద్యులు, ఆస్పత్రి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధుల గురించి వివరించారు. పిల్లల్లో వ్యాధులను గుర్తించేందుకు త్వరలోనే ఇంటింటి సర్వేతో గుర్తించి జిల్లా స్థాయి ఆస్పత్రుల్లో చికిత్సలు అందించనున్నట్లు వైద్యులు హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివరాజ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

● **కులకచర్ల:** గ్రామాల్లో వందశాతం మొక్కలు నాటాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వస్థలాల్లో, రోడ్డుకు ఇరువైపులా, పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. బ్లీచింగ్ పౌడరు చల్లించి దోమల నివారణకు రాత్రి సమయంలో అన్ని కాలనీల్లో ఫాగింగ్ చేయించాలని తెలిపారు. పీరంపల్లి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా నేడు బీఎంఎస్ ఎదిగిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లిఖిత్ కుమార్ అన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ సంఘ్ నాయకులు తమ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా లిఖిత్ కుమార్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి అహర్నిషలు పాటుపడుతున్న ఏకైక కార్మిక సంఘం తమదన్నారు. కార్మికుల హక్కుల సాధన, సంక్షేమానికి తమ నాయకులు పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, మేడ్చల్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి గంగాధర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ భార్గవ్, ఉపాధ్యక్షుడు వై.ఏడుకొండలు, కోశాధికారి ఎం.నర్సింహారెడ్డి, కేశవులు, కృష్ణారెడ్డి, జి.చిన్నారెడ్డి, జి.వెంకటేశ్వర్లు, ఎస్.రసూల్ పాల్గొన్నారు.